


కల్తీ నెయ్యి తయారీలో రసాయనాలు వాడినట్లు తేలింది. భగవంతుడి ప్రసాదాన్ని నాణ్యమైన పదార్థాలతోనే చేయాల్సి ఉండగా శ్రీవారి ప్రసాదాన్ని కలుషితం చేశారు. మోనో గ్లిసరైట్, ఎసిటిక్ యాసిడ్ ప్రమ్ములు, లంచాల ఫైరీని సిట్ స్వాధీనం చేసుకుని నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసింది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 25.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్


తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 309 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




## నాడు తిరుమల గిరులను కుదించారు...

# నేడు కల్తీతో అపవిత్రం చేశారు



- నాటి నుంచి హిందూమతంపై వ్యవస్థీకృత దాడి
- తిరుమల డిక్లరేషన్ పై జగన్ ధిక్కారం
- గత పాలనలో టీటీడీలో ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచారం
- జరిగిన అపచారాలపై తీవ్రంగా స్పందించిన హైందవ మఠాలు
- కల్తీకి ఆస్కారం లేని విధంగా కఠినతరంగా నిబంధనలు
- హిందువుల మనోభావాలు కాపాడే బాధ్యత మాది
- కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో లఘు చర్చలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- వైసీపీ హయాంలో మహాపాపం పేరిట సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సీఎం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఓ పద్ధతి ప్రకారమే 2005 నుంచి హిందూమతంపై దాడి జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తిరుమల పరిధిని ఏడు కొండల నుంచి రెండు కొండలకు మాత్రమే పరిమితం చేస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవో తీసుకువచ్చారని అప్పటి నుంచే హిందూ మతంపై క్రమబద్ధంగా దాడి చేస్తూ వచ్చారని ఆక్షేపించారు. అప్పటి పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శామ్యూల్ అనే క్రైస్తవ అధికారి ఈ జీవో జారీ చేశారని వివరించారు. హిందూ సమాజంతో పాటు రెండేళ్ల పాటు తాము చేసిన పోరాటాల కారణంగా వెనక్కు తగ్గారని సీఎం స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో చేపట్టిన లఘు చర్చలో భాగంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ వ్యవహారంపై మహాపాపం పేరిట అసెంబ్లీలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైసీపీ హయాంలో 20.01 కోట్ల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసి ఘోర అపచారం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. రాజకీయ వివాదం ఉండకూడదని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో సిట్ ఏర్పాటైందని సీఎం వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. తప్పు చేసిన నిందితులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించిందని అన్నారు. అందుకే ఈ వ్యవహారంపై ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. లడ్డూ వ్యవహారంలో అనేక తప్పులు చేశారని సీఎం స్పష్టం చేశారు. 2019-24 మధ్య 59.71 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారని అన్నారు. రూ. 231.51 కోట్ల అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని నీరుగార్చారని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఓ ప్రణాళిక ప్రకారం లాలూచీ పడిన లూటి అని స్పష్టంగా తేలిందన్నారు. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా... నివేదికలు వచ్చినా అప్పటి టీటీడీ ఛైర్మన్ దానిని తొక్కి పెట్టారని అన్నారు. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని తానేమి సొంతగా చెప్పలేదని ఎన్డీడీబీ కాఫ్ ఇచ్చిన నివేదికనే బయటకు వెల్లడించానని అన్నారు.

**అప్పటి బోర్డుకు, ఛైర్మన్ కు తెలియకుండా తప్పులు జరిగాయా...? :** కల్తీ నెయ్యి సరఫరాకు అనుగుణంగా టెండర్ నిబంధనల్ని సడలించారని.. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సరఫరా చేయాలన్న నిబంధన తొలగించారని పేర్కొన్నారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి 1 ఏడాదికి కుదించారన్నారు. రోజుకు 12 టన్నుల వెన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 8 టన్నులకు తగ్గించారని అన్నారు. అక్రమాలకు తెరతీసేలా డెయిరీల వార్షిక టర్నోవర్ రూ. 250 కోట్ల నుంచి రూ. 150 కోట్లకు పరిమితం

● వివరాలు 2 లో



## గుంటూరు ఛానల్ పునరుద్ధరణకు

# రూ.369 కోట్లు

- శాసనమండలిలో ఎమ్మెల్సీ ఆలపాటి, మురుగుడు ప్రస్తావనకు మంత్రి నిమ్మల సమాధానం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్) :** కృష్ణ పశ్చిమ డెల్టా, సాగర్ ఆయకట్టులోని మెట్ట ప్రాంతానికి సంబంధించి కొంత భాగానికి కీలకమైన గుంటూరు ఛానల్ పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం శాసనమండలిలో చెప్పారు.

గుంటూరు చానల్‌అభివృద్ధిపై ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు అడిగ్గిన ప్రశ్నకు అనుబంధంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చర్చను కొనసాగించి గుంటూరు చానల్ సమస్యలను వివరిస్తూ, ఈ అంశంపై మరింత సుధీర్ఘంగా చర్చించాల్సిన అవసరం ఉందని సభ దృష్టికి తీసుకువాచారు. ఈ ఇరువురు సభ్యుల ప్రస్తావనకు సమాధానంగా మంత్రి స్పష్టమైన వివరణ ఇచ్చారు. 1972లో 27 వేల ఎకరాలకు సాగునీరు, ఏడు మండలాలు 33 గ్రామాలకి తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో 6000 క్యూసెక్కుల సామర్థ్యంతో గుంటూరు ఛానల్ ని నిర్మించారన్నారు.

50 ఏళ్ల సుదీర్ఘకాలం, ప్రకృతి వైపరీత్యాలు తదితర కారణాలతో గుంటూరు ఛానల్ బండ్స్, స్లోప్స్, గట్లు ఉపరితలాలు దెబ్బతిన్నాయన్నారు. హెడ్ రెగ్యులేటర్లు, షెటర్లు యూటీలు శిధిల స్థితికి చేరాయి అన్నారు.

మిగతా 2లో...

## హిందూ ధర్మంపై దాడి...

# 11 కోట్ల మంది భక్తులకు కల్తీ ప్రసాదం

- శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై కఠిన చర్యలు తప్పవు
- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటం అత్యంత తీవ్రమైన నేరమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ నేరానికి పాల్పడిన బాధ్యులను కూటమి ప్రభుత్వం కచ్చితంగా శిక్షిస్తుందని తెలిపారు. మంగళవారం శాసనసభలో తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై జరిగిన చర్చలో ఆయన విస్తృతంగా మాట్లాడారు.

శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కుట్ర జరిగిందని ఆయన ఆరోపించారు. నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్డీడీబీ) నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని పేర్కొనగా, సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తులో నెయ్యిలో అసలు నెయ్యే లేదని తేల్చిందని చెప్పారు. పామాయిల్‌తో పాటు ఇతర రసాయనాలు కలిపి నకిలీ నెయ్యి తయారు చేసినట్లు ఆధారాలు లభించాయని వెల్లడించారు.

గత ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి వాడినట్టు సిట్ విచారణలో బయటపడిందన్నారు.

మిగతా 2లో...

## పశుసంవర్ధక శాఖకు పునరుజ్జీవం

- గత ఐదేళ్ల పాలనలో అన్ని శాఖలకు తాళాలు వేశారు
- జగన్ హయాంలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారింది
- పశుసంవర్ధక శాఖను నిర్వీర్యం చేసిన వైసీపీ
- వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2 లో..



## ఫిబ్రవరి 28న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఒక్కరోజు ముందుగా పెన్షన్ల పంపిణీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం.
- 62.76 లక్షల పింఛనుదారులకు రూ. 2725.79 కోట్లు పంపిణీ చేయనున్న ప్రభుత్వం.
- కొత్తగా 8,977 మంది లబ్ధిదారులకు రూ. 3.59 కోట్లు విడుదల

2 లో..



## శ్రీకాకుళంలో డయేరియా ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

- జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడిన ముఖ్యమంత్రి
- డయేరియా బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీకాకుళంలో డయేరియా ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. మంగళవారం ఈ ఘటనపై వేర్వేరుగా రెండుసార్లు జిల్లా అధికారులతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అందుతున్న వైద్యంపై సీఎం ఆరా తీశారు. శ్రీకాకుళం నగరంలో రోడ్ రిపేర్ పనుల కారణంగా డయేరియా వ్యాపించిందని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ ఘటనలో మొత్తంగా 65 మంది వివిధ ఆస్పత్రుల్లో చేరారని వివరించారు. ఎనిమిది మంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని...ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో మొత్తం 55 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు.

2లో...



రాష్ట్ర వ్యాప్తంగా పాల విక్రయ కేంద్రాల్లో

# తనిఖీలు



- నమూనాల ఫలితాలతోనే రాజమహేంద్ర వరం కల్తీ పాల మూలాలపై స్పష్టత
- మరో 3 నుంచి 5 రోజుల్లో పరీక్షల ఫలితాల రాక
- ఏడుగురి పరిస్థితి ఆందోళనకరం
- చెన్నై, ముంబై నుంచి రానున్న ప్రత్యేక మందులు
- నిలకడగా మిగిలిన వారి ఆరోగ్యం
- విలేకర్ల సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు వీరపాండియన్, నీలకంఠారెడ్డి వెల్లడి

3 లో

ప్రభుత్వ డైట్, బీఈడీ, బీపీ ఈడీ కళాశాలలను

# బలోపేతం చేస్తాం



- ముఖ గుర్తింపు వ్యవస్థ ద్వారా ప్రైవేటు బీఈడీ కళాశాలల్లో అవకతవకలకు అడ్డుకట్ట
- శాసనమండలిలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ డైట్, బీఈడీ, బీపీఈడీ కళాశాలలను బలోపేతం చేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో అధ్యాపకుల కొరత, ఖాళీలను భర్తీ చేసేందుకు తీసుకున్న చర్యలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల వివరాలు, ప్రైవేటు ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో అవకతవకలు నివారించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పోటీతత్వ ఆధారిత విద్యకు అనుగుణంగా శిక్షణ విధానాలు, పాఠ్యాంశాల సవరణ గురించి శాసనమండలిలో సభ్యులు

మిగతా 3లో...

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలను

# యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తాం

ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను తీర్చిదిద్దుతాం

శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

మిగతా 3లో...

‘అందరికీ ఇళ్లు పథకం’...

## గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు



- కొత్తగా 4,08,876 దరఖాస్తుల రాక
- వైసీపీ హయంలో 43,948 మంది అనర్హులకు ఇళ్ల పట్టాలు
- పరిశీలనలో ఇంకా 1,11,037 మంది లబ్దిదారులు
- పేదలకు ఇళ్ల పేరుతో దోచుకున్న జగన్ సర్కార్
- శాసనసభలో మంత్రి అనగాని సమాధానం

3 లో

## ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ కీర్తి కిరీటం విశాఖపట్నం

- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- విశాఖ పరిసర ప్రాంత అభివృద్ధికి రూ. 8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు కుదుర్చుకున్నామని స్పష్టం
- హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అంతర్జాతీయ స్థాయిగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్న మంత్రి దుర్గేష్

3 లో

కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు



- 6 గురుకులాల జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్
- బీసీ హాస్టళ్లలో రూ.14.56 కోట్లతో 971 మరుగుదొడ్ల నిర్మాణం
- 5 ఏళ్ల వైసీపీ హయాంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో దారుణ పరిస్థితులు
- మరమ్మతులైన కుళాయిలు కూడా మార్చలేదు
- బీసీ బిడ్డల విద్యకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం
- శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సవిత

3 లో

## శ్రీకాకుళంలో డయేరియా ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష



(మొదటి పేజీ తరువాయి)

శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో 30 మంది, జిజిహెచ్ లో 11 మంది, జెమ్స్ లో 6 మంది, యుపిహెచ్‌సిలో నలుగురు, మెడికవర్‌లో ఒకరు, ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో ముగ్గురు బాధితులు చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, ప్రస్తుతం వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిగిలిన 53 మంది బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని, వారు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని వివరించారు. డయేరియా ప్రభావంపై నగరంలో జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వే గురించి సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో భాగంగా డయేరియా లక్షణాలు ఉన్న మరో 79 మందిని గుర్తించామని, అయితే వారి పరిస్థితి ఆందోళనకరంగా లేదని... ఆసుపత్రిలో చేర్చాల్సిన అవసరం లేదని డాక్టర్లు తెలిపినట్టు వివరించారు. వారికి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇంటి వద్దే అందజేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాధితులందరికీ అత్యుత్తమ వైద్యం అందేలా చూడాలని, ముఖ్యంగా వెంటిలేటర్‌పై ఉన్న ఇద్దరి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. వ్యాధి మరింత ప్రబలకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాగునీటి కాలుష్యం జరగకుండా క్లోరినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మురుగునీటి కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బాధితులకు ధైర్యం చెప్పాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## ఫిబ్రవరి 28న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 24 ఫిబ్రవరి 2026: 1 మార్చి 2026 ఆదివారం అయినందున ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లు ఒక రోజు ముందుగా అనగా 28 ఫిబ్రవరి 2026వ తేదీన కొత్తగా మంజురైన 8,977 వితంతు(స్పౌస్) పెన్షన్ లతో కలిపి మొత్తం 62,76,322 మంది పింఛనుదారులకు రూ. 2725.79 కోట్లు స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు సిబ్బంది పింఛనుదారుల ఇంటివద్దనే అందజేయడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీల క్రింద్ర మొత్తం 62,76,322 మంది పింఛనుదారులకు రూ .2725.79 కోట్లు స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డ్ సిబ్బంది పంపిణిచేస్తారని అన్నారు. 28 ఫిబ్రవరి 2026 తేదిన పంపిణీ చేయగా మిగిలిన పెన్షన్ లను 2 మార్చి 2026న సచివాలయ సిబ్బంది పింఛనుదారుల ఇంటివద్దనే పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు పింఛన్ల మొత్తంగా రూ. 57,808.68 కోట్లు ఖర్చు చేయటం జరిగిందని, ఇది రాష్ట్ర ప్రభుత్వానికి సామాజిక భద్రత పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ ఈ ప్రకటనలో తెలియజేశారు.

## పశుసంవర్ధక శాఖకు పునరుజ్జీవం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని శాఖలకు తాళాలు వేసిన పరిస్థితి నెలకొందని, ముఖ్యంగా పశుసంవర్ధక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసి అభివృద్ధిని కుంటుపెట్టారని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం అసెంబ్లీలో తీవ్ర విమర్శలు చేశారు. శాసనసభలో ఎమ్మెల్యేలు పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ హయాంలో పశుసంవర్ధక శాఖలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, రైతులు, పశుపాలకులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కూడా అందించలేని దుస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. పశువుల చికిత్సకు అవసరమైన మందులు లేవు, ఆధునిక పరికరాలు లేవు, ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉండగా, వాటిని చూసుకునే సిబ్బంది కూడా లేకుండా శాఖను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖ ద్వారా మొత్తం 3176కేంద్రాలు పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వీటిలో చాలా కేంద్రాలు పేరుకే పరిమితమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. రైతుల విరాళాలతో నిర్మించిన పాత భవనాలను కూడా సంరక్షించలేక, వాటిని శిథిలావస్థకు నెట్టారని ఆరోపించారు. గత పాలనలో ఐదేళ్ల పాటు పశు సంవర్ధక శాఖకు నిధులు కేటాయించకుండా, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ఫలితంగా పశువైద్యశాలలు మందుల్లేక, సిబ్బంది లేక, రైతులకు ఉపయోగపడని పరిస్థితిలోకి వెళ్లాయని మంత్రి అన్నారు.

**కూటమి ప్రభుత్వం వచ్చాకే పశుసంవర్ధక శాఖకు ఊపిరి :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిస్థితిని సమీక్షించి, పశుసంవర్ధక శాఖ పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి RIDF-NABARD / ESVHD నిధుల సహకారంతో ఇప్పటివరకు 485 భవనాలు నిర్మించామని వివరించారు. ఇంకా 826 పశుసంస్థలకు సంబంధించిన భవనాలు దయనీయ స్థితిలో ఉన్నాయని, వీటిలో 400 సంస్థలకు వెంటనే కొత్త భవనాలు అవసరం ఉండగా ఇందుకు రూ. 265.10 కోట్లు, మరో 426 సంస్థలకు తక్షణ మరమ్మతుల కోసం రూ. 37.40 కోట్లు అవసరమని మంత్రి వెల్లడించారు. ఈ అన్ని అవసరాలను దృష్టిలో పెట్టుకొని, 2026-27 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాల మధ్య, RIDF-NABARD బడ్జెట్ కింద దశలవారీగా పశువైద్యశాలల భవనాల నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలా శాఖలను నిర్వీర్యం చేయడం కాకుండా, రైతులు, పశుపాలకులకు వాస్తవంగా ఉపయోగపడే విధంగా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# నాడు తిరుమల గిరులను కుదించారు... నేడు కల్తీతో అపవిత్రం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

చేశారన్నారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారని.. వీటితో పాటు ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని కూడా నీరుగార్చారన్నారు. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రధాన సూత్రధారులుగా పోమిల్ జైన్ , విపిన్ జైన్ తో పాటు భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ ఉందన్నారు. ఏఆర్, శ్రీవైష్ణవీ, మాల్ గంగా డెయిరీలు భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలుగా వ్యవహరించి కల్తీ నెయ్యి సరఫరా చేశారని సీఎం స్పష్టం చేశారు. రూ. 4.5 కోట్ల లంచం డబ్బుతో నాటి చైర్మన్ పీఏ చిన్నప్పన్న అడ్డంగా దొరికి పోయారని సీఎం తెలిపారు. తప్పుడు రిటర్నులతో తప్పుదారి పట్టించారని.. ల్యాబ్ నివేదికల్ని కూడా ఫోర్జరీ చేశారన్నారు. ల్యాబ్ ల కన్నుగప్పి టెండర్లు దక్కించుకున్నారని అన్నారు. కల్తీ నెయ్యి తయారీకి, సరఫరాకు ఓ ముఠాగా ఏర్పడ్డారని... తయారికి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు కూడా సిట్ తేల్చిందన్నారు. శ్రీవారి ప్రసాదాన్ని కలుషితం చేసి ఘోర అపచారం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. టీటీడీలోని సాంకేతిక నిపుణులకు కూడా ఖరీదైన ఫోన్లు ఎరవేసి కల్తీ నెయ్యికి గేట్లు తెరిచారన్నారు. మోనో గ్లిసరైట్, ఎసిటిక్ యాసిడ్ లాంటి ద్రమ్ములను, లంచాల వివరాలతో కూడిన డైరీని కూడా సిట్ స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఈ కుట్రకు పాల్పడిన నిందితులపై సిట్ అభియోగాలు కూడా మోపిందన్నారు. తప్పు చేసిన వ్యక్తులు ఇప్పుడు మళ్లీ బుకాయించి మాపైనే ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇవన్నీ టీటీడీ బోర్డు చైర్మన్ కు తెలియకుండా జరుగుతాయా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఆ సమయంలో ప్రసాదం తీసుకున్న ప్రతీ ఒక్కరూ నాణ్యత తగ్గిందని చెప్పారని వివరించారు.

**టీటీడీని'అన్యమతస్తులతో నింపేశారు:** ఎవరికి ఏ బాధ వచ్చినా శ్రీ వేంకటేశ్వరస్వామిని మొక్కుకుని ఆయనతో చెప్పుకుంటామని.. 2019-24 మధ్య స్వామి వారికి జరిగిన అపచారం పట్ల తీవ్ర ఆవేదన చెందామని అన్నారు. శ్రీవారి ఆలయంలో అన్యాయం జరుగుతోందని, రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని పోరాడితే కేసులు పెట్టి వేధించారని శాసనసభలో సీఎం వివరించారు. రామతీర్థంలో రాముడి తల నరికారని అక్కడికి వెళ్తే తన పైనా కేసులు పెట్టారని తెలిపారు. బ్రిటీషర్లు కూడా తమ పాలనలో తిరుమల శ్రీవారి జోలికి వెళ్లలేదని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. సామాన్య భక్తులు ఏడు కొండలవాడా గోవిందా అనే నామాన్ని స్మరిస్తూ తిరుమలకు వెళ్తారని అలాంటి ఏడు కొండలను రెండు కొండలకు కుదిస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి దాడి మొదలెట్టారని అన్నారు. ఈ నిర్ణయంపై రెండేళ్ల పాటు దేశంలోని హిందువులంతా తీవ్ర ఆందోళనలు చేయటంతో ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారని అన్నారు. ఈ అంశంపై పోరాటం చేసిన తనపైనా ఆరోపణలు, ఫేక్ ప్రచారం చేశారని ముఖ్యమంత్రి వివరించారు. ఉడిపి పెజోవర్ మఠాధిపతి విశ్వేశ్వర తీర్థ స్వామిజీ ఆదేశం మేరకు ఏర్పాటు అయిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ



తిరుమలలో అన్యమత జోక్యంపై నివేదిక ఇచ్చిందన్నారు. తిరుమలతో పాటు అక్కడి విద్యా సంస్థల్లో అన్యమత ప్రచారం జరిగిందని, ఉద్యోగులు, దుకాణాల్లోనూ అన్యమతస్తులు ఉన్నట్టుగా తేల్చిందని వివరించారు. గతంలో తిరుమల స్పెసిఫైడ్ అథారిటి అధ్యక్షుడిగానూ క్రైస్తవుడైన అధికారిని తప్పించాలని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ నివేదిక ఇచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. శ్రీవేంకటేశ్వరా యూనివర్సిటీ, పద్మావతి విశ్వవిద్యాలయాలకు కూడా వీసీలుగా క్రిస్టియన్లనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి నియమించారని పేర్కొన్నారు. వారి హయాంలో బలవంతపు మత మార్పిడులు కూడా జరిగాయని ఆరోపణలు వచ్చినట్టు వివరించారు. 2019 వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుమలకు వెళ్లే ఆర్టీసీ బస్సు టికెట్లపైనా జెరుసలేం యాత్రకు వెళ్లాలంటూ అన్యమత ప్రచారం చేశారన్నారు. టీటీడీ ప్రతిష్ఠ దిగజార్చేలా గత పాలకులు వ్యవహరించారని.. అన్యమతస్తులైన చైర్మన్లను నియమించారన్నారు. నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి క్రిస్టియన్ గా బైబిల్ పట్టుకుని తిరిగారని ఆరోపించారు. అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కుమార్తెకు మెదక్ చర్చిలో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం జరిగిందని గుర్తు చేశారు. ఇలాంటి వారిని చైర్మన్లుగా ఎలా నియమిస్తారని సీఎం ప్రశ్నించారు. గత పాలకుల హయాంలో టీటీడీ వెబ్ సైట్ లో ఏసు ప్రభువు ఫోటో, శిలువ కూడా వచ్చేసిందని అన్నారు. దీనిపై పత్రికల్లో రాస్తే... ఆ పత్రికల్ని బెదిరించటానికి వంద కోట్ల డిఫమేషన్ వేయించారని అన్నారు.

**తిరుమల అంటే గత పాలకులకు చులకన :** లేని పింక్ డైమండ్ చోరీ అంటూ గతంలో తనపై దుష్ప్రచారం కూడా చేశారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. శ్రీవారిని అప్రతిష్టపాలు చేసే కుట్రకు ఇది మరో ఉదాహరణ అని అన్నారు. జంబో పాలక మండలి నియామకంతో రాజకీయ పునరావాసంగా టీటీడీని మార్చేశారని సీఎం అన్నారు. హైకోర్టు తప్పు పట్టటంతో గత పాలకులు ఆ జీవోను వెనక్కు తీసుకున్నారని తెలిపారు. పరకామణిలో చోరీ జరిగితే దానిని కూడా సెటిల్ చేసేందుకు రాజీ ప్రయత్నాలతో పాటు చోరీని సమర్థిస్తూ చులకనగా గత పాలకులు మాట్లాడారని వివరించారు. దేవదేవుడి హుండీలో చోరీ జరిగితే ఇంత చులకనగా మాట్లాడతారా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. తిరుమల క్షేత్రానికి వెళ్లిన ఎవరైనా అక్కడ నిర్దేశించిన ఆచార సంప్రదాయాలను పాటిస్తారని... శ్రీవారి ఆలయానికి వెళ్లి డిక్లరేషన్ పై సంతకం చేయమంటే చేయకుండా గత పాలకుడు ధిక్కరించారని అన్నారు. డిక్లరేషన్ పై క్యాన్సిల్ అని నమోదు చేసి దౌర్జన్యం ప్రదర్శించారని ఆక్షేపించారు. అధికారం ఉంది కదా అని అహంభావంతో ప్రవర్తించారని ఆక్షేపించారు. 2019-24 మధ్య ప్రణాళికా బద్ధంగా హిందూమతంపై దాడి జరిగిందని ఆరోపించారు. మొత్తం 2032 దేవాలయాలపై దాడి జరిగిందని... విగ్రహాలను ధ్వంసం చేశారని వేటిపైనా కేసు పెట్టి సరైన విచారణ చేయలేదన్నారు. రామతీర్థం, అంతర్వేది రథం, దుర్గగుడి వెండి సింహాల చోరీ లాంటి ఘటనలు చాలా జరిగినా నిందితులపై ఎలాంటి చర్యలూ లేవన్నారు. కూటమి హయాంలో దేవాలయాలపై దాడులకు పాల్పడితే ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. తిరుమలలో జరిగిన ఈ వ్యవహారాలపై హిందూ మఠాలు, పీఠాధిపతుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చాయన్నారు.

**కూటమి వచ్చాకే టీటీడీ ప్రక్షాళన :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే టీటీడీలో ప్రక్షాళనా చర్యలు మొదలు పెట్టామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాద నాణ్యతను పెంచామని... ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ధృవీకరణ తర్వాతే లడ్డూ తయారీకి వినియోగించే పదార్థాలు కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. భక్తులకు వడ్డించే అన్న ప్రసాద పాత దిట్టాన్ని తిరిగి అమల్లోకి తీసుకువచ్చామని... నాణ్యత, రుచి కూడా పెరిగాయని.. 98 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని సీఎం శాసనసభలో వివరించారు. పీఏసీ 5 వెంకటాద్రి నిలయం వద్ద ఆధునిక వసతులతో వంటశాల అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. భక్తులకు కేటాయించే గదులు, కాటేజీలను కేంద్రీకృతం చేసి దర్శనాలతో అనుసంధానించామని వివరించారు. బ్రేక్ దర్శనాలను కూడా నియంత్రించి సాధారణ భక్తుల దర్శన సమయం పెంచామన్నారు. రద్దీ నియంత్రణ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లోనూ ఈ క్యూ మేనేజ్మెంట్ సిస్టం అమలు చేస్తామని చెప్పారు. దేశీయంగా 200 దేవాలయాల జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టామని తెలిపారు. వైకుంఠ ఏకాదశి, బ్రహ్మోత్సవాలు, రథసప్తమి లాంటి పర్వదినాల్లో తరలివచ్చిన లక్షల మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. 60 టీటీడీ దేవాలయాల్లో రూ. 700కోట్లతో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తిరుమలలో గ్రీన్ కవర్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని 3.5 ఎకరాల్లో దివ్య ఔషధ వనం ప్రాజెక్టు కూడా త్వరలో ప్రారంభిస్తామని వివరించారు. అన్నదాన, ప్రాణదాన కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని తెలిపారు. శ్రీవారి సేవకుల కార్యక్రమం ద్వారా వైద్యులు కూడా సేవలందించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 5 వేల దేవాలయాలను నిర్మించేలా కార్యాచరణ చేపట్టామని తెలిపారు.

**హెరిటేజ్ నీతి నిజాయితీతో నిలబడింది :** కుటుంబ వ్యాపార సంస్థగా ఉన్న హెరిటేజ్ ప్రభుత్వంతో ఎక్కడా ఒప్పందాలు చేసుకుని ఉత్పత్తులు విక్రయించలేదని సీఎం స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వ శాఖ హెరిటేజ్ నుంచి ఒక్క కిలో నెయ్యి కూడా కొనుగోలు చేయలేదన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండానే నీతి నిజాయితీతో హెరిటేజ్ నిలబడిందని శాసనసభలో వివరించారు. అయినా సాక్షి పత్రికలో ఇష్టానుసారంగా కథనాలు రాశారన్నారు. నేరస్తులు ఏ విధంగా సంస్థల క్రెడిబిలిటీని దెబ్బతీస్తారు అనటానికి ఈ రాతలే పెద్ద ఉదాహరణ అన్నారు. గత పాలనలో భారతీ సిమెంట్స్ నుంచి హౌసింగ్ పథకాలు, ప్రాజెక్టుల్లో సిమెంట్ కొనుగోలు చేశారని దీనిపై తామేమి మాట్లాడ లేదని అన్నారు. నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ డెయిరీతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని సీఎం ఆక్షేపించారు. రోజూ 20 లక్షల లీటర్ల పాలు సేకరించి విక్రయిస్తున్న హెరిటేజ్ నీతి నిజాయితీతో వ్యాపారం చేస్తోందని తెలిపారు. ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ కు నెయ్యి విషయంలో అసలు సంబంధమే లేదని వివరించారు. పూణేలో ఉన్న ఇందాపూర్ డెయిరీ ప్రసిద్ధ కంపెనీలన్నిటికీ కో మాన్యుఫాక్చరింగ్ చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. మదర్ డెయిరీ, బ్రిటానియా, ఆయుర్వేద ఘీ పతంజలి, డిమార్ట్, రిలయన్స్, దొడ్ల, హాడ్సన్ , జీఆర్బీ, అముల్, హెరిటేజ్ ప్రముఖ సంస్థలకు ఉత్పత్తుల కో మాన్యుఫాక్చరింగ్ చేస్తోందన్నారు. రాజమహేంద్రవరంలో పాల కల్తీ ఘటన జరిగితే దానిపై చర్చించకుండా మండలిలో అడ్డుకున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఈ ఘటనపై చర్చించి తగిన చర్యలు చేపట్టిందని తెలిపారు. గత పాలకులు చేసిన తప్పుల్ని ఒప్పుకోవాలని... దేవాలయాల పవిత్రతను దెబ్బ తీయవద్దని సీఎం హితవు పలికారు. తప్పుచేసిన వ్యక్తులే తమను క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హైందవ ధర్మంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానన్నారు. వేర్వేరు మతాలకు చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే అధికారం మరొకరికి లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# గుంటూరు ఛానల్ పునరుద్ధరణకు రూ.369 కోట్లు.







(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో 2014-19 మధ్య అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం గుంటూరు ఛానల్ జీరో కిలోమీటర్ నుంచి 47 కిలోమీటర్ వరకు ఆధునీకరణకు 378 కోట్లు మంజూరు చేసి పరిపాలన ఆమోదం ఇచ్చిందన్నారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2021లో ఈ పనులను క్లోజ్ చేసిందన్నారు. గుంటూరు ఛానల్ మౌలిక ఆశయానికి గండి కొట్టింది అన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఛానల్ ప్రాముఖ్యతను గుర్తించి 625 కోట్లు అంచనా వ్యయంతో పునరుద్ధరణకు పరిపాలనామోదం కోసం పంపా మన్నారు. అయితే నిపుణులు దీన్ని సవరించి అత్యవసర ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులతో కొత్త ప్రతిపాదనలు పంపమనగా 369 కోట్లు ఖర్చు కాగల సవరించిన ప్రతిపాదన పరిపాలన ఆమోదం కోసం పంపించామన్నారు. ఆమోదం రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఇదే ఛానల్ కు సంబంధించి 47వ కిలోమీటర్ తోనే ఆగిపోకుండా 72 కిలోమీటర్ల వరకు విస్తరించి పూర్తిస్థాయిలో అంటే 750 క్యూసెక్కులు పంపే విధంగా విస్తరణ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందుకు గాను 285 కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. పరిపాలనామోదం రాగానే ఈ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు.

అలాగే మంగళగిరి పురపాలక సంఘ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి గౌరవ మంత్రి నారా లోకేష్ పట్టుదలతో కృషి చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల డ్రైనేజ్ వాటర్ ప్రక్షాళనకు ఎక్కడికి అక్కడ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తామన్నారు.

# హిందూ ధర్మంపై దాడి... 11 కోట్ల మంది భక్తులకు కల్తీ ప్రసాదం

(మొదటి పేజీ తరువాయి)

భక్తులు ఇప్పటికే లడ్డూ నాణ్యతపై పలు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు. సున్నితమైన అంశం కావడంతో తొలుత రాజకీయ ఆరోపణలు చేయలేదని, అయితే కల్తీ జరగలేదని కొందరు చెప్పడం వల్ల వాస్తవాలు వెల్లడించాల్సి వచ్చిందన్నారు.

**గత పాలక మండలిదే బాధ్యత :** ఈ వ్యవహారంలో గత ప్రభుత్వం తాలూకు వ్యక్తులపై ప్రత్యక్ష ఆరోపణలు చేయలేదని, కానీ అప్పటి టీటీడీ పాలక మండలిదే పూర్తి బాధ్యత అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. నిస్పక్షపాత విచారణకు ఎవరైనా ముందుకు రావాలని, దోషులకు కఠిన శిక్ష పడాలని అన్నారు. కల్తీ జరగలేదని వాదించడం వల్లే సభలో ఇంత విస్తృత చర్చ జరుగుతోందని వ్యాఖ్యానించారు.

**నిబంధనలు మార్చి కాంట్రాక్టుల కట్టబెట్టింపు :** సిట్ దర్యాప్తు ప్రకారం, నచ్చిన సంస్థలకు కాంట్రాక్టులు ఇవ్వాలనే ఉద్దేశంతో టెండర్ నిబంధనలు సవరించారని తెలిపారు. నెయ్యి సరఫరా సంస్థకు ఉండాల్సిన కనీస వార్షిక టర్నోవర్‌ను రూ. 250 కోట్ల నుంచి రూ. 150 కోట్లకు తగ్గించారని, రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరణ నిబంధనను తొలగించారని చెప్పారు. డెయిరీ రంగంలో మూడేళ్ల అనుభవాన్ని ఏడాదికి కుదించడమే కాకుండా,



రోజుకు 12 టన్నుల వెన్న తయారీ నిబంధనను 8 టన్నులకు మార్చినట్లు వివరించారు.

సవరించిన నిబంధనల ప్రకారం ఎంపికైన సంస్థలు 2020-2023 మధ్య నెయ్యి సరఫరా చేశాయని, ఆ సంస్థలకు అవసరమైన అర్హతలు లేవని సిట్ ఛార్జ్‌షీట్ పేర్కొన్నట్లు తెలిపారు. పాల వినియోగం లేకుండానే రసాయనాలతో నకిలీ నెయ్యి తయారు చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

**11 కోట్ల భక్తులకు కల్తీ ప్రసాదం :** 2019--2024 మధ్య సుమారు 11 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 48.76 కోట్ల లడ్డూలు విక్రయమయ్యాయని, అందులో సుమారు 20.10 కోట్ల లడ్డూలు నకిలీ నెయ్యితో తయారైనవని టీటీడీ రికార్డులు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. రసాయనాలతో నిండిన ప్రసాదాన్ని భక్తులకు అందించడమే అత్యంత అపచారం అని వ్యాఖ్యానించారు.

హిందూ ధర్మంపై దాడి జరిగితే భాష, కులం, ప్రాంతాలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు ఇతర మతాల్లో జరిగితే దేశవ్యాప్తంగా తీవ్ర ప్రతిస్పందన వచ్చేదని పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక బోర్డు అవసరమని అభిప్రాయపడ్డారు.

**దేవాలయాల పరిరక్షణపై పిలుపు :** రాజు కోసం వసూళ్లు చేసే వారికి దేవాలయాలపై అధికారం ఇవ్వొద్దని, భగవంతుడి ధనాన్ని దుర్వినియోగం చేసే వారు నాశనం అవుతారని హెచ్చరించారు. శ్రీకృష్ణదేవరాయలు రచించిన అముక్తమాల్యదలో పేర్కొన్న పద్యాన్ని ఉదహరిస్తూ, ఆలయాల నిర్వహణలో నైతిక విలువలు అత్యంత ముఖ్యమని చెప్పారు.

ఈ కేసును ఎంతకాలం సాగదీసినా వాస్తవాలు బయటకు వస్తాయని, మహా అపచారానికి పాల్పడిన వారికి శిక్ష తప్పదని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ తీరుకు నిరసనగా బీజేపీ మహిళా మోర్చా భారీ ర్యాలీ



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026 సదస్సు సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రవర్తనను నిరసిస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పుష్ప హోటల్ నుంచి కొత్త వంతెన వరకు మహిళా నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీగా సాగారు.

సదస్సు వేదికగా రాహుల్ గాంధీ మరియు ఆయన అనుచరులు అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం దేశ గౌరవానికి భంగం కలిగించే చర్యగా మహిళా మోర్చా నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలు అంతర్జాతీయ వేదికపై భారత ప్రతిష్టను దిగజారుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశ యువత ఆశయాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం దురదృష్టకరమని విమర్శించారు.

బీజేపీ మహిళా నేత చిగురుపాటి లక్ష్మి మాట్లాడుతూ, ఏఐ సదస్సుకు 100కు పైగా దేశాల ప్రతినిధులు, 200కు పైగా గ్లోబల్ టెక్ దిగ్గజాలు హాజరైన నేపథ్యంలో దేశ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపై ఉందన్నారు. సుమారు 80 శాతం దేశాలు భారత ఏఐ విధానాలకు మద్దతుగా ఢిల్లీ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయని గుర్తుచేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో దేశం సాంకేతిక రంగంలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తోందని, అలాంటి సమయంలో ఉద్దేశపూర్వకంగా దేశాన్ని అవమానించే చర్యలు తగవని అన్నారు. దేశ గౌరవాన్ని దెబ్బతీసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా నాయకులు డిమాండ్ చేశారు.

దేశం సూపర్ పవర్‌గా ఎదుగుతున్న వేళ ఓర్వలేక ఇటువంటి ప్రవర్తనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో మరెవరూ ఇలాంటి చర్యలకు పాల్పడరని స్పష్టం చేశారు.

## కాకుమాను ఎస్ఐగా హరికృష్ణ



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను నూతన ఎస్ ఐ గా హరికృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ ఐ ఫ్రుద్వి ఏక్ నాథ్ పట్టాభిపురం స్టేషన్ కు బదిలీ పై వెళ్లారు. ఆయన స్థానం లో హరి కృష్ణ వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ ఐ హరి కృష్ణ మాట్లాడుతూ తాను మంగళగిరి స్టేషన్ లో పని చేస్తూ సాధారణ బదిలీ లో భాగంగా కాకుమాను వచ్చినట్లు తెలిపారు. ఉన్నతధికారుల ఆదేశాలు, సూచనలు పాటిస్తూ స్టేషన్ సిబ్బంది ని సమన్వయము చేసుకుంటూ కాకుమాను మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్యలు, అసంఘిక కార్యకాలాపాల పై ప్రత్యేకంగా నిఘా పెడుతామన్నారు. ముందుగా స్టేషన్ సిబ్బంది నూతన్ ఎస్ ఐ కు ఘనంగా స్వాగతం పలికారు.

## ప్రభుత్వ డైట్, బీఈడీ, బీపీ ఈడీ కళాశాలలను బలోపేతం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, కావలి గ్రీష్మ, బి.తిరుమలనాయుడు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డైట్(జిల్లా విద్యా, శిక్షణ సంస్థ) కళాశాలల్లో ఉన్న ఖాళీలను డిప్యూటేషన్ విధానంలో భర్తీ చేశాం. కరిక్యులమ్ అప్ డేట్ విషయంలో కన్సల్టేషన్స్ అన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో నిర్వహించాం. ఈ నెల 26, 27 తేదీల్లో సెకెండ్ రౌండ్ కన్సల్టేషన్ జరుగుతుంది. అనంతరం నూతన కరిక్యులమ్ రివైజ్ చేసి అమలుచేస్తాం. ప్రధానంగా కాంపిటెన్స్ బేస్డ్ ఎడ్యుకేషన్, ఎఫ్ఎల్ఎన్ ప్రయారిటీ, టెక్నాలజీ ఇంటిగ్రేషన్, ఇండియన్ ఈథోస్ ఇంటిగ్రేషన్ కీలకమైనవని మేం భావిస్తున్నాం. ఇవి మొత్తం ఇంటిగ్రేట్ చేసి అమలుచేస్తాం.

ప్రైవేటు బీఈడీ కళాశాలల విషయంలో.. ఇప్పటికే ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) ను అమలుచేశాం. ఇంజనీరింగ్ లో కూడా అమలుచేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ అమలుచేస్తున్నప్పుడు అటెండెన్స్ కూడా తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంది. కాబట్టి ఇంజనీరింగ్ లో కూడా ఎఫ్ఆర్ఎస్ ను అమలుచేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. గౌరవ సభ్యులు చెప్పినట్లు మెథడాలజీ, పెడలాజీని కూడా ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాల్సిన అవసరం ఉంది. ఒకవైపు మనం ఎస్ సీఈఆర్టీని బలోపేతం చేస్తున్నాం, పాఠశాల విద్యలో కరిక్యులమ్ ప్రతి సైకిల్ లో అప్ డేట్ చేస్తున్నాం. ఇందులో భాగంగా ఇక్కడ కూడా చేయాల్సిన అవసరం ఉంది. డైట్స్ లో కూడా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. తప్పనిసరిగా చేస్తాం. ట్రైనింగ్ సెంటర్స్ లో మౌలిక వసతులు అభివృద్ధి చేసేందుకు ఆదేశాలు జారీ చేశాను.

ప్రభుత్వ డైట్, బీఈడీ, బీపీ ఈడీ కళాశాలల్లో 2019 నుంచి 2024 వరకు రిక్రూట్ మెంట్ జరగలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే 16వేల మంది ఉపాధ్యాయులను నియమించాం. ప్రతిఏడాది రిటైర్ మెంట్స్ చూసుకుని ఏటా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించాం. నైతిక విలువలపై సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావు గారిని నియమించుకున్నాం. ప్రతివారం నైతిక విలువలపై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. దీనిని ప్రతి పాఠశాలకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. పుట్టపర్తి శ్రీ సత్యసాయి ట్రస్ట్ ద్వారా రాగిజావ అందజేస్తున్నాం. అగ్రిమెంట్ కూడా పునరుద్ధరిస్తున్నాం. శ్రీ సత్యసాయి పవచనాలను కూడా పాఠ్యాంశాల్లో చేర్చి నైతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉంది. మారుతున్న కాలంలో మానసిక ఆరోగ్యం కూడా చాలా అవసరం. ఏఐ ద్వారా మానసిక సమస్యలను ముందుగానే గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర విభజన వల్ల ఎంత నష్టపోయామనేందుకు డైట్ కళాశాలలే నిదర్శనం. ఎస్ సీఈఆర్టీ విభజన వల్ల మన ఇన్ ఫ్రాస్ట్రక్చర్ తెలంగాణలో ఉండిపోయాయి. పదేళ్ల తర్వాత ఎస్ సీఈఆర్టీని బలోపేతం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో 3 డైట్ కళాశాలలను సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గా తీర్చిదిద్దుతాం. మిగతా డైట్ కళాశాలల్లో మౌలిక సౌకర్యాలను మెరుగుపరుస్తామని తెలిపారు.

## కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ ఆధారిత హాజరుతో బీసీ హాస్టళ్లలో డైట్ బిల్లు మంజూరులో నకిలీ క్లెయిమ్ లను నియంత్రించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించనున్నామని, ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామని వెల్లడించారు. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో చాలా దారుణ పరిస్థితులు నెలకున్నాయని, కనీసం మరమ్మతులైన కుళాయిలను కూడా మార్చలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వపు డైట్ బకాయిల చెల్లింపుతో పాటు బీసీ హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టామని వివరించారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగి ప్రశ్నలకు మంత్రి సవిత జవాబిచ్చారు. 891 బీసీ వసతి గృహాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు రూ.20 కోట్లతో యూపీఎస్ లు/ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 814 హాస్టళ్లలో రూ.16.85 కోట్లతో ఈ ఏడాది మే నాటికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు పూర్తి చేస్తామని తెలిపారు. జల మిత్ర యాప్ ద్వారా ప్రతి 15 రోజులకొకసారి హాస్టళ్లలో నీటి నమూనాలను పరీక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పౌర సౌకర్యాలు మెరుగుపరచడంలో భాగంగా 397 బీసీ హాస్టళ్లలో చిన్న చిన్న మరమ్మతులు చేశామన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.14.56 కోట్లతో బీసీ హాస్టళ్లలో 971 మరుగుదొడ్లు నిర్మిస్తున్నామని, ఈ ఏడాది జూన్ నాటికి వాటిని నిర్మాణాలు పూర్తి చేస్తామని సభకు వెల్లడించారు. హాస్టళ్లలో మెనూ, పరిశుభ్రత, పారిశుధ్యం పర్యవేక్షణకు ఆరోగ్య సేవా మాడ్యూల్ ప్రారంభించామని, హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాలకు వంట పాత్రలు, ఇతర సామాగ్రి సరఫరా చేశామన్నారు.

**కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు :** బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ గురుకుల పాఠశాలలను ప్రారంభించబోతున్నామన్నారు. ఆరు ఎంజేపీ గురుకుల స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్న వినతుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో చేరో ఎంజేపీ స్కూళ్లను ప్రారంభించిందన్నారు. రూ.500 కోట్ల సాస్కి నిధులు 10 ఎంజేపీ గురుకుల పాఠశాలల భవనాలను నిర్మించబోతున్నామన్నారు.

**కుళాయి మరమ్మతులు కూడా చేయని జగన్ :** బీసీల విద్యకు అన్న ఎన్టీఆర్ ప్రాధాన్యమిస్తే, అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు 2014-19 మధ్య 65 ఎంజేపీ బీసీ గురుకులాల నిర్మాణానికి అప్పట్లో రూ.1,210 కోట్లు మంజూరు చేశారని మంత్రి సవిత తెలిపారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల గురించి పట్టించుకోలేదన్నారు. చివరికి పులివెందులలో బీసీ బాలిక గురుకుల పాఠశాల నిర్మాణాన్ని కూడా గాలి కొదిలేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాకతో పులివెందుల ఎంజేపీ బాలిక గురుకుల పాఠశాల నిర్మాణం ఊపందుకుందన్నారు. రాబోయే జూన్ లో సీఎం చంద్రబాబుతో పులివెందుల ఎంజేపీ బాలిక గురుకుల పాఠశాలను ప్రారంభించబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. 5 ఏళ్ల వైసీపీ ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లలో చాలా దారుణ పరిస్థితులు నెలకున్నాయని, కనీసం పాడైపోయిన కుళాయిలకు కూడా మరమ్మతులు చేయలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీ హాస్టళ్లలో మరమ్మతులు చేయించిందన్నారు. రూ. 60 కోట్ల సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులతో మరమ్మతులు, నిర్మాణాలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన రూ.110 కోట్ల డైట్ బకాయిలు చెల్లించామని మంత్రి సవిత గుర్తు చేశారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో సన్నబియ్యంతో భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తూ ఉత్తమ ఫలితాలు రాబడుతున్నామని, ఇది బీసీలు, బీసీ విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని మంత్రి సవిత వెల్లడించారు.

## ఇ.వి.యం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):**కలెక్టరేట్ ఆవరణలోని ఇ.వి.యం గోడౌన్ ను నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్ కు వేసిన తాళాల సీళ్ళు, సీసీ కెమెరాల డిసిప్లే, ప్రాంగణంను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇ.వి.యం గోడౌన్ భద్రత విషయంలో రాజీ లేకుండా అవసరమైన అన్ని చర్యలు నిరంతరం పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణా రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు లోచర్ల రమేష్, ఆర్ అండ్ బీ డిప్యూటీ ఎస్ఈ హజరతయ్య, ఆర్ అండ్ బీ ఎలక్ట్రికల్ డీఈ కాళిమాత, పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా పాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనకు సంబంధించి ఆసుపత్రిలో ఉన్న వారికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

వీర పాండియన్ వెల్లడించారు.

పాలలో యూరియా ఆనవాళ్ల గురించి ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని చెప్పారు. ఒకవేళ పాలలో యూరియా కలిసినట్లయితే వెంటనే కిడ్నీ ఫెయిల్యూర్, కాలేయం దెబ్బతినడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. యూరియా కలిసిన పాలను దీర్ఘకాలం సేవిస్తేనే కిడ్నీ, లివర్ ఫెయిల్యూర్, మూత్రం రాకుండా స్తంభించడంవంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెప్పారని తెలిపారు. ఇథలిన్ గ్లైకాల్ కలిసిన పాలను సేవించిన మూడు, నాలుగు రోజులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కూడా చెప్పారని పేర్కొన్నారు. అసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తకేసులు మంగళవారం ఏమీ నమోదుకాలేదన్నారు.

మంగళగిరిలోని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఇన్స్టిట్యూటు ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంటు) డైరెక్టర్ నీలకంఠారెడ్డితో కలిసి వీరపాండియన్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు రాజమహేంద్రవరంలో జరిగిన ఘటనకు సంబంధించి పాలను శీతలికరణచేసే మిషన్లో కూలెంటుగా ఉపయోగించిన ఇథలిన్ గ్లైకాల్ లీక్ అయినట్లు పోలీసుల విచారణలో గుర్తించారని చెప్పారు. తాము బాధితుల ఇళ్లల్లో ఉపయోగించగా మిగిలిన పెరుగు, నెయ్యి, వెనిగార్, పాల నమూనాలను 10 వరకు సేకరించి వాటిని పరీక్షనిమిత్తం హైదరాబాద్, కాకినాడలోని జాతీయ ఆహార భద్రత సంస గుర్తించిన ప్రయోగశాలలకు పంపించామని తెలిపారు విక్రేత విక్రయించిన పాలు దొరకలేదని, అయితే పెరుగు, పన్నీర్, నెయ్యి, మీగడ నమూనాలు సేకరించామన్నారు నీటి ఫలితాలు బుధవారం నుంచి శనివారం మధ్య దశల వారీగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు నీటి ఆధారంగానే పాల కల్తీకి సంబంధించి స్పష్టత వస్తుందని భావిస్తున్నామని తెలిపారు.

**ఏడుగురి పరిస్థితి ఆందోళనకరం :** రాజమహేంద్రవరం ఘటనకు సంబంధించి ఇప్పటివరకు నలుగురు మరణించారని తెలిపారు ప్రస్తుతం 15 మంది పలు అసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు వీరిలో ముగ్గురు వెంటిలేటర్లు, ఇద్దరు డయాలసిస్, మరో ముగ్గురు వెంటిలేటర్-డయాలసిస్పై ఉన్నారని వీరపాండియన్, నీలకంఠారెడ్డి వివరించారు. మొత్తం ఏడుగురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు చికిత్స పొందుతున్న వారిలో ఐదునెలల పాపతోపాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారని తెలిపారు.


**చెన్నై, ముంబయి నుంచి ప్రత్యేక మందుల రాక :** బాధితుల ఆరోగ్య పరిస్థితిని సీనియర్ నెఫ్రాలిజిస్ట్ రవిరాజ్ సూచనల మేరకు కిడ్నీల పనితీరు త్వరగా మెరుగుపడేందుకు వీలుగా ఇక్కడ అందుబాటులో లేని మందులను చెన్నై, ముంబయి నుంచి తెప్పిస్తున్నామని తెలిపారు వీటితో వెంటనే బాధితులకు చికిత్స అందిస్తామని వెల్లడించారు. ఈ నెల 16న ఇళ్లకు పాల సరఫరా జరిగిందని కొందరిలో ఆలస్యంగా లక్షణాలు బయటపడే అవకాశం ఉందని తెలిపారు దీనివల్ల 24 గంటలపాటు వైద్యులను సదరు ప్రాంతాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. మరో నెల వరకు ఈ చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.


**రక్త పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ముగ్గుర్ని ఆసుపత్రుల్లో చేర్పించాం :** రక్త పరీక్షల ద్వారా క్రియాటిన్ స్థాయి ఎక్కువగా ఉన్న వారిలో ఇద్దరిని గుర్తించి ఆసుపత్రుల్లో చేర్పించామని అధికారులు వివరించారు. వ్యాపారి దగ్గర పాలు కొనుగోలుచేసి, 110 కుటుంబాలకు చెందిన 315 మంది రక్తనమూనాలు సేకరించామన్నారు వీరిలో ఇద్దరికి క్రియాటినిన్ సాయి ఎక్కువగా ఉండడం, మరొకరిలో అనుమానిత లక్షణాలు కనిపించడంతో ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రుల్లో చేర్పించామన్నారు. వీరి ఆరోగ్య పరిస్తితి నిలకడగా ఉందని వెల్లడించారు.

**కొనసాగుతున్న పోలీసుల విచారణ :** రాజమహేంద్రవరం ఘటనకు సంబంధించి పోలీసులు అదుపులో ఉన్న వ్యక్తి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం డెయిరీ పాల నిల్వల విషయంలో కూలెంటుగా వాడిన ఇథలిన్ గైకాల్, ఇతర అంశాల గురించి విచారణ సాగుతుందని పేర్కొన్నారు. పాల శీతలీకరణ యంత్రానికి మరమ్మతులు చేసిన మెకానిక్ను సైతం పోలీసులు విచారించారని, అది మరమ్మతుకు గురైతే తాను సరిచేశానని తెలిపారు. పోలీసులు ఇంకా తీవ్ర స్థాయిలో విచారణ జరుపుతున్నారని పేర్కొన్నారు.

**పాల విక్రయ, నిల్వ కేంద్రాల్లో తనిఖీలు :** రాష్ట్ర వ్యాప్తంగా పాల వర్తకులు, పాల తయారీదారులు, నిల్వదారులు, హోల్సేల్ వర్తకుల నుంచి నమూనాల సేకరణ బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఐపీఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డి వెల్లడించారు వారివద్ద ఆధీకృత లైసెన్సులు ఉన్నాయా? లేవా అన్న వాటిపై తనిఖీల్లో గుర్తించనున్నామని తెలిపారు.

## ఎస్ఐ ఏక్ నాథ్‌కు ఆత్మీయ వీడ్కోలు






**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):**కాకుమాను పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్థిస్తూ బదిలీ అయిన ఎస్ ఐ ధ్రువ్ ఏక్ నాథ్ ను సోమవారం రాత్రి స్టేషన్ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సన్మాన కార్యక్రమం లో ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులలో బదిలీలు సాధారణ అంశం అని అన్నారు. ఉన్న కాలంలో ఏక్ నాథ్ బాధ్యతగా పనిచేసారని అన్నారు. అధికారులు ఆదేశాలు పాటిస్తూ సిబ్బంది ని సమన్వయము చేసుకుంటూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కు కృషి చేసారన్నారు. స్టేషన్ సిబ్బంది చిరంజీవి, ప్రభాకర్,భరత్, శ్రీకాంత్ ఇతర సిబ్బంది ఎస్ ఐ తో వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఏక్ నాథ్ ను ఘనంగా సత్కరించ్చారు. ఈ కార్యక్రమం లో ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది ఎ ఎస్ ఐ మూర్తి, హెడ్ కానిస్టేబుల్ లు చిరంజీవి, ప్రభాకర్, కానిస్టేబుల్ శ్రీకాంత్, భరత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**ఎస్.ఐ ఏక్ నాథ్ ను సన్మానించిన కొండపాటూరు దేవస్థానకమిటీ:** కాకుమాను మండలంలో ఎస్సైగా విధులు నిర్వహించిన ఏక్ నాథ్ బదిలీపై పట్టాభిపురం వెళ్తున్న సందర్భంగా గత సంవత్సరం కొండపాటూరు తిరుణాలను ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతల ను పరిరక్షిస్తు విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలియజేస్తూ కొండపాటూరు పోలేరమ్మ అమ్మవారి ట్రస్ట్ బోర్డు తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరునాళ్లకు వారు చేసిన సేవలకు గుర్తుగా సన్మానించి జ్ఞాపక అందజేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు, తహసీల్దార్ బి వెంకట స్వామి, ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, కాకుమాను ఎస్ ఐ హరి కృష్ణ,ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, గింజపల్లి నవీన్,రామినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లు సాధించే వరకు పోరాటం ఆగదు




**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):**తమ న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించాలని కోరుతూ ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని అంగన్వాడి సిబ్బంది ప్రత్తిపాడు సీడీపీఓ కార్యాలయం నందు రెండవ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు, అనేక సేవలు

అందిస్తున్నారన్నారు . పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు . అంగన్వాడీలకి

వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం చేయాలని 2023 డిశంబర్ లో 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామనీ తెలిపారు. ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అంగన్వాడీల వేతనాలు పెంచాలని

అనేకమార్లు ప్రభుత్వానికి విన్నవించామన్నారు. అయినా నేటి వరకు అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఇటీవల కొన్ని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేసినందులకు అభినందనలు తెలిపారు. ఇంకా కొంతమంది

అర్హత ఉన్న మినీ వర్కర్లు 10వ తరగతి పాస్ అయిన మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేయలేదన్నారు.

2024 మార్చిలో అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలుచేస్తామని జీఓ నెం. 8 ఇచ్చారన్నారు. నేటికి సుప్రీంకోర్టు

తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చట్టానికి అమలుచేయడానికి గైడ్లైన్స్ రూపొందించలేదన్నారు . రూరల్లో ఉ

న్న అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమపథకాలు అమలుకావడంలేదన్నారు . ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం ఇస్తున్న స్నాక్సు ఆపివేశారన్నారు.

ఫిబ్రవరి 23 నుండి 27 వరకు రిలే నిరాహారదీక్షలు, ప్రాజెక్టు, జిల్లా స్థాయిల రిలే నిరాహార దీక్షలు

మార్చి 2 విజయవాడలో మహాధర్నా చేస్తామని తెలియజేశారు.ప్రధానంగా అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26000/-లు ఇవ్వాలన్నారు.

పెండింగ్లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలక్సేషన్ ఇచ్చి మెయిన్సెంటర్లుగా మార్చాలి

,గ్రాట్యూటి అమలుకు గైడ్ లేన్స్ రూపొందించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్, రూరల్ తేదీ లేకుండా అందరికీ అమలుచేయాలన్నారు .

హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలుచెయ్యాలన్నారు .

పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలన్నారు .

మే నెల అంతా వేసవి సెలవుల జీఓ వెంటనే ఇవ్వాలన్నారు .

లబ్ధిదారులకు బియ్యం, ఆయిల్, కందిపప్పు క్వాంటిటి పెంచాలన్నారు . మెనూచార్జీలు పెంచాలన్నారు . ఉచితంగా గ్యాస్ సరఫరాచెయ్యాలన్నారు .

ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు . ఈ కార్యక్రమం లో పెద నందిపాడు సెక్టర్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, కాకుమాను సెక్టార్ అధ్యక్షురాలు ఝాన్సీ, పాండ్రపాడు సెక్టర్ హెల్పర్ అధ్యక్షురాలు గౌతమి, వివిధ గ్రామాల అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తాం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల మంజూరుపై శాసనమండలిలో సభ్యుడు ఏ.శివరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేయడం జరిగింది. మొత్తం 9 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధన సిబ్బంది, 5 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయడం జరిగింది. నేను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కాలేజీల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో డేటా లేదు. ఏ టీచర్ ఎక్కడ పనిచేస్తున్నారో కూడా సమాచారం లేదు. ఈ సమాచారాన్ని సేకరించడానికి నాకు 20 నెలల సమయం పట్టింది. గతంలో నేను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేది. వైసీపీ హయాంలో విద్యాశాఖను నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాల మంజూరు చేసినా, జూనియర్ కాలేజీ మంజూరు చేసినా ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ తో ముందుకు వెళ్తున్నాం. ప్రైవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు అవసరమైన అధ్యాపకులను నియమించాల్సిన అవసరం ఉంది. ల్యాబ్ లు కూడా ఏర్పాటుచేస్తాం. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందజేయాల్సిన అవసరం ఉంది. ఇంటర్ విద్యలో మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాం. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తున్నాం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

## 'అందరికీ ఇళ్లు పథకం'... గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైసీపీ పాలనా కాలంలో పేదలందరికీ ఇళ్లు పేరుతో 6 వేల కోట్ల రూపాయాల కుంభకోణాలకు పాల్పడ్డారని రాష్ట్రరెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ గత ప్రభుత్వం 22 లక్షల మంది ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తే అందులో 7 లక్షల మంది కన్వేయన్స్ డీడ్లే తీసుకోలేదన్నారు. ఇళ్ల పట్టాల కోసం నివాస యోగ్యం కాని పల్లపు భూములు, శశ్మానాలు, ఊరికి దూరంగా ఉండే భూములు, వర్షాలకు మునిగి పోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక రేట్లు ఇచ్చి సేకరించరాని చెప్పారు. ఇళ్ల పట్టాలు నివాసయోగ్యంగా లేని కారణంగా రెండున్నర లక్షల మంది ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు నిరాకరించారని తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని, తమ ప్రభుత్వం విచారణ చేయించగా 43,948 మంది అనర్హులు తేలినట్లు చెప్పారు. పరిశీలనలో ఇంకా 1,11,037 లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరికీ ఇళ్లు పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అయితే గత ప్రభుత్వం సెంటున్నర, సెంటు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మొత్తం 4,08,876 దరఖాస్తులు ఇళ్ల పట్టాల కోసం వచ్చాయని, ఇందులో 1,03,494 దరఖాస్తులను అమోదించగా 1,41,928 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. ఇంకా 1,56,454 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ కీర్తి కిరీటం విశాఖపట్నం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖపట్నం ఒక కలికుతురాయి అని, దానిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అసెంబ్లీలో స్పష్టం చేశారు. విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్. వంశీ కృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు.

నూతన పర్యాటక పాలసీ (2024-29)తో విశాఖను యాంకర్ హబ్‌గా చేస్తూ 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో సింహాచలం, బౌద్ధ, బీచ్, ఎకో టూరిజం థీమాటిక్ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఇటీవల జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా రూ. 8,650 కోట్ల విలువైన 50 ఒప్పందాలు కుదిరాయని, తద్వారా ఒబేరాయ్, తాజ్, మేఫెర్, అట్మాస్ఫియర్ కోర్ వంటి ప్రముఖ హోటల్ సంస్థలు విశాఖకు వస్తున్నాయన్నారు. అదే విధంగా స్టేట్ ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ బోర్డులో 16 ప్రాజెక్టులను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. తద్వారా విశాఖలో 2858 రూమ్ ల ఏర్పాటుకు రూ.4098 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ కింద సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి రూ. 54.04 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి రూ. 28.87 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశామన్నారు. రుషికొండ, తిమ్మాపురం, సాగర్ నగర్ బీచ్, భీమిలి దగ్గర గోస్తనీ బ్యాక్ వాటర్స్ తదితర ప్రాంతాల్లో స్కూబా డైవింగ్, పారా మోటరింగ్ వంటి 10 రకాల జలక్రీడలు ప్రారంభమయ్యాయన్నారు. 6 నెలల్లో 25 కంటే ఎక్కువ కార్యకలాపాలు ఇప్పటికే ప్రారంభించడం జరిగిందన్నారు. విశాఖలో ప్రభుత్వం, ట్రావెల్ మార్ట్ తో కలిసి సమీపంలోని తొట్ల కొండ, బావికొండ లను కలుపుతూ బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేయాలని ప్లాన్ చేస్తోందన్నారు. విశాఖ-భువనేశ్వర్- కోల్ కత్తా, విశాఖపట్నం- చెన్నై-ట్యూటికోరన్ ను సీ క్రూజ్ సర్క్యూట్ గా ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశామన్నారు. విశాఖ-అరకు సీ ప్లేన్, హెలీ టూరిజం, విశాఖ-చెన్నై-పుదుచ్చేరి క్రూజ్ సర్వీసులను బలోపేతం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ - విశాఖపట్నం మధ్యలో క్యారవాన్ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ మధ్య కాలంలో క్యారవాన్ పాలసీని కూడా తెచ్చామన్నారు. తద్వారా అన్ని ప్రాంతాల్లో క్యారవాన్ పార్క్ లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. అదే విధంగా ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో విశాఖ నుండి భీమిలీకి మధ్య ఉన్న సందర్శక ప్రాంతాలన్నీ పర్యాటకుడు సందర్శించేలా ప్రారంభించబడిన హాప్ ఆన్ హాప్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సుల ద్వారా సత్ఫలితాలొస్తున్నాయన్నారు. భారత్ మండపం తరహాలో ఏపీలో ఆంధ్రా మండపాన్ని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. తద్వారా విశాఖలోని బీచ్ లను అభివృద్ధి చేయాలని, విశాఖలోని ఎకనమిక్ రీజియన్ క్రింద ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ఈ రంగానికి ఊతమిచ్చినట్లైందన్నారు. తద్వారా స్థానికులకు ఉపాధి కల్పించేలా హోమ్ స్టే పాలసీ, బ్రెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ విధానం తీసుకొచ్చి 490 హోమ్ స్టేలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**సీఆర్ జెడ్ నిబంధనలపై స్పష్టత:** ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు కోరిన విధంగా బీచ్ రోడ్డులో నిర్మాణాలకు ఆటంకంగా ఉన్న సీఆర్ జెడ్ జోన్ 3 నుండి జోన్ 2కి మార్చే అంశాన్ని అనేక పర్యాయాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. 'సీఆర్ జెడ్ 19' అమల్లోకి వస్తే పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ దిశగా తమ ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సభలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ,



పర్యాటకులు విదేశాలకు వెళ్లకుండా విశాఖలోనే అంతర్జాతీయ స్థాయి ఎంటర్ టైన్ మెంట్ హబ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-24 కాలంలో కుదేలైన పర్యాటక రంగాన్ని మళ్లీ పట్టాలెక్కించామని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ క్రమంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను మూడు హబ్ లుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి తాము చేస్తున్న కృషి, ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో మరిన్ని పర్యాటక కార్యక్రమాలు చేపట్టి పర్యాటకాభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

# రాష్ట్ర స్థాయిలో రాణించిన హర్షిత




**తాండూర్, ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర స్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలలో అచ్చులాపూర్ హైస్కూల్ విద్యార్థిని చౌల్ల హర్షిత ద్వితీయ స్థానంలో సిల్వర్ మెడల్ బహుమతితో పాటు రూ.15000 వేలు ప్రైజ్ మనీ సాధించినట్లు పిడి సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుండి 23 వరకు హైదరాబాద్ లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలలో తాండూర్ మండలం అచ్చులాపూర్ హైస్కూల్ లో 9వ తరగతి చదువుతున్న చౌల్ల హర్షిత ద్వితీయ బహుమతి వెండి పతకం సాధించినట్లు తెలిపారు. ఈ విద్యార్థినిని ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంఈఓ శ్రీనివాస్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఏఏపిసి చైర్మన్ చిలకమ్మ, ఉపాధ్యాయ బృందం గ్రామస్థులు అభినందించారు.

# ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



**శేరిలింగంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్ డి.శశిరేఖ అధికారులను ఆదేశించారు. మియాపూర్‌లోని సర్కిల్ 48 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆమె పాల్గొని బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 10 దరఖాస్తులు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4, టౌన్ ప్లానింగ్ 3, యూబీడీ, ఎలక్ట్రికల్, రెవెన్యూ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసీ విజయ్ కుమార్, టీపీఎస్ రమేష్, డీఈ వశిధర్, ఏఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఎస్ శ్రీనివాస్, ఇంజినీరింగ్ సెక్షన్ నుంచి ప్రశాంత్, ఎంటమాలజీ విభాగం నుంచి బాలగౌడ్, వెటర్నరీ నుంచి గీత, యూబీడీ నుంచి సతీష్ బాబు, యూసీడీ నుంచి వీణ, ఎలక్ట్రికల్ సెక్షన్ నుంచి శివ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాంనగర్ యూత్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కౌన్సిలర్‌లకు సన్మానం



**చౌటుప్పల్, ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ ఫైల్) :** చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డుకు చెందిన మెజారిటి నూతన కౌన్సిలర్ లు 13 వ కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్, 12 వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి, 18 వ వార్డు బుడ్డ సురేష్, 19 వ వార్డు కౌన్సిలర్ పిల్లల మర్రి మధుసూదన్‌లను సోమవారం రాంనగర్ యూత్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొదుల యాదగిరి అధ్యక్షతన ఘనంగా సన్మాణించడం జరిగిందిగి. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో వివిధ పార్టీ లనుండి గెలుపొందిన కౌన్సిలర్ లు మెజారిటి స్థానం లో రాంనగర్ కాలనీ 13 వ వార్డు కు చెందిన వారే కావడం గర్వకారణం అన్నారు. అభివృద్ధి లో వెనుక బాటుకు గురైన 13 వ వార్డును కౌన్సిలర్‌ల సహకారంతో అభివృద్ధి చేయాలని కోరారు. మునుముందు మరిన్ని పదవులు చేపట్టాలని ఆశించారు. ఈ కార్యక్రమం లో కాలని పెద్దలు మాజీ ఉప సర్పంచ్ పాక పద్మ, మాజీ వార్డు మెంబర్ జటంగి కృష్ణ, బొమ్మిరెడ్డి సంజీవ రెడ్డి, యూత్ గౌరవ అధ్యక్షులు చింతల బాబు,బోదుల లింగస్వామి,శ్యామాల లింగస్వామీ,ఎర్రసాని శేఖర్,ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి,మాజీ ఉత్సవకమిటీ అధ్యక్షులు కనకమోని శ్రీనివాస్, జటంగి రవి,సభ్యులు జటంగి రాజు, కోనేటి కృష్ణ, కాలనీ వాసులు వర్కల కుమార్, తొర్పునూరి బాబు, మార్గం నర్సింహా,కళ్లెం నాగరాజు, సంగిశెట్టి రమేష్,గుండ్ల నాగరాజు,యూత్ సభ్యులు బోదుల నరేష్,కడెం వెంకటేష్, ఊధరి స్వామీ నాదం, బయ్యా సంపత్, చింతల హేమంత్, కత్తుల రవి, మహిళలు తొర్పునురి బాలమ్మా, బయ్యా కవిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో పౌర సమస్యల వెల్లువ



**శేరిలింగంపల్లి,(జర్నలిస్ట్ ఫైల్):** శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'కి ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. జోనల్ కార్యాలయంతో పాటు వివిధ సర్కిల్ కార్యాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 19 వినతులు అందగా, అందులో అత్యధికంగా శేరిలింగంపల్లి సర్కిల్ నుంచే 9 ఫిర్యాదులు రావడం గమనార్హం. ప్రధానంగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, పన్నుల విభాగానికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్నఇబ్బందులపై బాధితులు అధికారులకు మొరపెట్టుకున్నారు. మియాపూర్‌లో3,అమీన్‌పూర్‌లో2, నార్సింగిలో 1, జోనల్ కార్యాలయంలో 4 చొప్పున అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే స్వయంగా వినతులను స్వీకరిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనిర్లక్ష్యంవహించవద్దనిఆయావిభాగాలఅధికారులను ఆదేశించారు.

# ఓపెన్ కరాటే పోటీలలో సత్తా చాటిన లత నవోదయ సైనిక్ స్కూల్ విద్యార్థులు



**మందమర్రి(జర్నలిస్ట్‌ఫైల్)** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని కృష్ణ గార్డెన్‌లో మాన్యు మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 22/2/2026 నాడు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో మందమర్రి పట్టణంలో ని లత నవోదయ సైనిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ లత నాగరాజు సోమవారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ లత నాగరాజు మాట్లాడుతూ మా పాఠశాలలో చదువు తో పాటు విద్యార్థులకు క్రీడలను కూడా సమానంగా ప్రోత్సహిస్తున్నామని. కరాటే లాంటి క్రీడలను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు శారరిక మానసికంగా దృఢంగా ఉంటారని అలాగే ప్రతి విద్యార్థికి చక్కటి క్రమశిక్షణ ఏర్పడుతుందని తెలియజేశారు. బహుమతులు సాధించిన విద్యార్థులను సోమవారం రోజు పాఠశాల ఉపాధ్యాయలు అభినందించారు

# బెల్లంపల్లిలో మాదిగ హక్కుల దండోరా నిరసన

**-నాగర్‌కర్నూల్ ఘటనలో పసిపాప మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ ఫైల్) :** నాగర్‌కర్నూల్ జిల్లా కొమ్మెరలో మండలంలో కుల వివక్ష కారణంగా రెండు నెలల పసిపాప మృతి చెందిన ఘటనపై బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకునూరి రాజ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్ నాయకత్వంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుక రాజనర్సు మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా కొమ్మెరలో మండల కేంద్రంలో జరిగిన మల్లన్న జాతర సందర్భంగా దైవ దర్శనానికి వెళ్లిన బీసీకి చెందిన రజక కుటుంబం, ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళపై అగ్రకుల దురహంకారంతో దాడి చేసి, రెండు నెలల పసిపాప మృతికి కారణమైన ఘటన అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. కుల ఆధారిత వివక్ష కారణంగా పసిపాప ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన తుకారాం రెడ్డి, మధుకర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి లను వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించి, కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కుల ఆధారిత హింసకు స్థానం లేదని ప్రభుత్వం స్పష్టమైన సందేశం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారపు కోళ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకునూరి రాజ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్, జిల్లా కార్యదర్శి ఇడిగిరాల ప్రసాద్, పట్టణ గౌరవ అధ్యక్షుడు ఆరేపెల్లి రమేష్, యువజన నాయకులు గద్దల కుమార్, సీనియర్ నాయకులు పల్లె రమేష్, నాథరి భీమయ్య, ఎరుకల సంఘం జిల్లా నాయకుడు ఉండాడి మల్లయ్య, పట్టణ నాయకుడు ఆరేపెల్లి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘన విజయం సాధించిన చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తికి అభినందనలు



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ ఫైల్) :** నిర్మల్ పట్టణంలోని గాంధీ పార్క్ వార్డు నం.9 ప్రాంతానికి చెందిన యువకులు, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా డిగ్నిటీ మెన్స్ సెలూన్ యజమాని మన్సూర్ ఖాన్ మాట్లాడుతూ, గతంలో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో నిర్మల్ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచేలా అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. అదే అభివృద్ధి దిశలో ప్రస్తుత పదవీకాలంలో కూడా పట్టణాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఖుస్రో (జర్నలిస్ట్), అమైర్ ఖాన్ (సివిల్ ఇంజనీర్), నవీన్ (వ్యాపారవేత్త), సల్మాన్ ఖాన్ (వ్యాపారవేత్త), డాక్టర్ సయ్యద్ మోమిల్ అలీ (ఆర్బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్) తదితరులు చైర్మన్‌ను షాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నిర్మల్‌లో సంఘ శాఖల మహాసమ్మేళనం

**-వేలాది స్వయంసేవకుల హాజరుకు సన్నాహాలు**




**నిర్మల్‌జిల్లా, ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ ఫైల్) :** నిర్మల్ నగరంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో సంఘశాఖల సమ్మేళనం నిర్వహించనున్నారు. మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 7.00 గంటల నుంచి 8.15 గంటల వరకు సమ్మేళనం కొనసాగుతుంది. నగరంలోని సుమారు 21 శాఖలకు చెందిన దాదాపు 3,000 మంది స్వయంసేవకులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి శాఖ నుంచి 100 నుంచి 150 మంది వరకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గణవేశ్ తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం, సంఘ కార్యకలాపాలపై అవగాహన విస్తరించడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. హిందూ సమాజానికి చెందిన ప్రముఖులు, మేధావులు, కార్యకర్తలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే భారతీయ జనతా పార్టీ కు చెందిన కార్యకర్తలు కూడా తమ తమ ప్రాంతాల నుంచి స్వయంసేవకులతో కలిసి సమ్మేళనంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని ప్రతి కార్యకర్తకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎంపీ అరవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కౌన్సిలర్లు



**రాయికల్, (జర్నలిస్ట్ ఫైల్) :** మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన జగిత్యాల్ నియోజకవర్గంలోని జగిత్యాల మరియు రాయికల్ పట్టణాల కౌన్సిలర్లు సోమవారం హైదరాబాద్‌లో ధర్మపురి అరవింద్ గారిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా.భోగ శ్రావణి గారు కూడా పాల్గొన్నారు. కౌన్సిలర్లు ఎంపీ అరవింద్‌ని కలిసి పట్టణాల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసమస్యలు మరియుభవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. ఎంపీ పట్టణాల సమగ్రఅభివృద్ధికి తనసహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు,జగిత్యాల్ పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, కౌన్సిలర్లు కల్లెడ ధర్మపురి, వేముల శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, కొక్కు అనిత, సిరిపురం శ్రీలత-శ్రీనివాస్, గట్టి పెల్లి జ్ఞానేశ్వర్, కునారపు మానస-భూమేష్, తోపారపు ప్రశాంతి-సురేష్, పుర్రె శ్రీధర్, వేముల మౌనిక-రాము తదితరులు పాల్గొన్నారు.

# శిరివెళ్ల ఆదర్శ పాఠశాలలో 6 తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు



**శిరివెళ్ల (జర్నలిస్ట్‌ఫైల్):** 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ మొదలైనందున ఈ ప్రవేశ పరీక్ష 12-04-2026 (ఆదివారం) ఉదయం 10.00 గంటల నుండి 12.00 గంటల వరకు నిర్వహించబడుతుందని ప్రిన్సిపాల్ ఇస్రాత్ బేగం పేర్కొన్నారు. ఈ ప్రవేశాలుపూర్తిగా ప్రతిభ ఆధారంగా ఉంటుందని. అభ్యర్థులు 23-02-2026 నుండి 31-03-2026వరకు ఆన్లైన్ ద్వారాwww.cse.ap.gov.in లేదా www.apms.apcf-ss.in వెబ్‌సైట్లు సందర్శించగలరు. లేదా ఆదర్శ పాఠశాల శిరివెళ్ల సందర్శించాలన్నారు. కాంటాక్ట్ ఫోన్ నెంబర్లు 9490117206 ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ ఇస్రాత్ బేగం తెలియజేశారు.

# ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కారించాలి - జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్






**జగిత్యాల, ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్‌ఫైల్) :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ బియస్ లతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 36 ఫిర్యాదులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి - జిల్లా ఎస్పీ ఆశోక్ కుమార్



**జగిత్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్‌ఫైల్) :** జగిత్యాల జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిశీలించారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలపూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఆక్షేపించారు.


# సహజ వ్యవసాయం,నానో ఎరువుల వినియోగం పై రైతులకు అవగాహన.ఏ.వో శ్రీకాంత్






**పెగడపల్లి, ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్‌ఫైల్):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఎల్లాపూర్ రైతు వేదిక లో సోమవారం రోజున మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో రైతులకు సహజ వ్యవసాయం మరియు నానో ఎరువుల వినియోగం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీకాంత్ మాట్లాడుతూ రైతుల ఆదాయం, ఖర్చుల తగ్గింపు మరియు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా సహజ వ్యవసాయం మరియు నానో ఎరువుల వినియోగం, సహజ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా భూసారాన్ని మెరుగుపరచడం రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం వల్ల లాభాలు పెరుగుతాయని వివరించారు. నానో యూరియా మరియు నానో డీఏపీ వంటి నానో ఎరువులు తక్కువ మోతాదులోనే పంటలకు సమర్థమైన పోషకాలు అందిస్తాయని ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడులు పెరగడంలో సహాయపడతాయని తెలిపారు. అలాగే పర్యావరణానికి హాని తగ్గి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందేశాలు నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ ఎల్లాపూర్ సర్పంచ్ రాజేశం, రాజారాంపల్లి సర్పంచి రమేష్ నాయక్, ఏఈఓ అక్షయ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన



- వెలిగొండ ప్రాజెక్టు సందర్శన అనంతరం ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన
- అనంతరం ప్రజావేదిక సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్న సీఎం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి 12.40 గంటలకు మార్కాపురం జిల్లాలోని గంటావానిపాలెం చేరుకుంటారు. 12.50 గంటలకు ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఫీడర్ కెనాల్‌ను పరిశీలిస్తారు. అక్కడి నుంచి 02.10 గంటలకు మార్కాపురం పట్టణం చేరుకుంటారు. 02.30 గంటలకు తర్లుపాడు రోడ్డులో నిర్వహించే ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం 05.20 గంటలకు అమరావతికి చేరుకుంటారు.

**జిల్లా ఏర్పాటు తర్వాత మొదటి పర్యటన**

మార్కాపురం జిల్లా అనేది ఆ ప్రాంత ప్రజల చిరకాల కల. ఎన్నికల ముందు అక్కడి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురంను జిల్లాగా ఏర్పాటు చేస్తూ జనవరిలో ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మార్కాపురం జిల్లా ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సారి పర్యటిస్తున్నారు. అదే విధంగా గత ప్రభుత్వం పూర్తి కాని వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. కెనాల్స్, ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్, జంట సొరంగాలు పనులు కాకపోవడంతో పాటు పునరావాసం కల్పించకుండానే జగన్ జాతికి అంకితం చేశారు. అయితే ప్రాజెక్టును పూర్తి చేసి ఆ ప్రాంత ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు సంకల్పించింది. ఈ నేపథ్యంలోనే రూ.456 కోట్లతో నిర్మించే ఫీడర్ కెనాల్ పనులకు రేపు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తారు.

# సోము వీర్రాజుపై బొత్స వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

- ఎవరి మెప్పుకోసం మాట్లాడాల్సిన అవసరం మాకు లేదు
- బొత్స వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆగ్రహం



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** శాసనమండలిలో బీజేపీ పక్ష నేత సోము వీర్రాజుపై ప్రతిపక్ష వైసీపీ నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతర కరమని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మండిపడ్డారు. ఎవరి మెప్పుకోసం మాట్లాడాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు.

శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా రామతీర్థం ఘటనలపై జరిగిన ఉద్యమాన్ని సోము వీర్రాజు ప్రస్తావించగా, ఆయన ఎవరినో మెప్పించడానికి మాట్లాడుతున్నారని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ మాధవ్ స్పందించారు. 'బొత్స సత్యనారాయణ ఎవరి మెప్పుకోసం ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు? ప్రజా సమస్యలను ప్రస్తావించడం మా బాధ్యత. వ్యక్తిగత విమర్శలు చేయడం సభా పరంపరకు విరుద్ధం' అని అన్నారు.

శాసనసభలో వైసీపీ ఎమ్మెల్యేలు చర్చలకు హాజరుకాకుండా, శాసనమండలిలో మాత్రం ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని మాధవ్ ఆక్షేపించారు. వైసీపీ సభ్యులు రాజకీయం చేయడమే పనిగా పెట్టుకున్నారని, వారి వైఫల్యాలు, కుట్రలను ప్రశ్నిస్తే ఎదురుదాడులకు దిగుతూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ఇకపై ఈ తరహా వ్యాఖ్యలు కొనసాగితే కూటమి సభ్యులు చూస్తూ ఊరుకోరని, సోము వీర్రాజుకు సంపూర్ణ మద్దతుగా నిలుస్తామని మాధవ్ స్పష్టం చేశారు. సభలో చర్చలు నిర్మాణాత్మకంగా సాగాలని, వ్యక్తిగత ఆరోపణలకు తావివ్వకూడదని ఆయన సూచించారు.

# రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా చొక్కాలు విప్పి నిరసన తెలిపిన ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను 'సింహాలు' గా అభివర్ణిస్తూ, వారు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయి సదస్సులో జరిగిన అసభ్యకర ప్రదర్శనలను సమర్థించడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. దేశంలో సాంకేతికాభివృద్ధి, ఆవిష్కరణలు, కృత్రిమ మేధస్సు వంటి కీలక అంశాలపై చర్చించాల్సిన, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొన్న వేదికను అసభ్యకర నిరసనలకు వేదికగా మార్చడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించడం క్షమించరానిదని వ్యాఖ్యానించారు.

ఇటువంటి చర్యలను ప్రోత్సహించడం యువతకు తప్పుడు సందేశాన్ని ఇస్తుందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు ఉన్నప్పటికీ, దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే విధానాలు అంగీకారయోగ్యం కావని జయప్రకాశ్ నారాయణ స్పష్టం చేశారు. దేశ రాజకీయ సంస్కృతిని, ప్రతిష్ఠను ఇనుమడించాల్సిన నాయకులు యువతను ప్రేరేపించే ముందు తమ మాటల ప్రభావాన్ని ఆలోచించాలని సూచించారు.

దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సమర్థించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మరొక్కసారి తన అసలు వైఖరిని బయటపెట్టిందని, ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు.

# ఉత్సాహభరితంగా ప్రారంభమైన ఏపీ లెజిస్లేచర్స్ స్పోర్ట్స్ మీట్

- ఐక్యతకు వేదికగా లెజిస్లేచర్స్ క్రీడలు
- శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు







**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నిత్యం ప్రజల మధ్య ఉండే ప్రజా ప్రతినిధులకు క్రీడలు ఒక ఆటవిడుపుగా ఉంటూ మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు.

ఆంధ్ర ప్రదేశ్ శాసన వ్యవస్థ ఆటవిడుపు లో భాగంగా మూడురోజులపాటు నిర్వహించే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడా ఉత్సవాలు–2026 ను మంగళవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు లు, జ్యోతి ప్రజ్వలన, స్పోర్ట్స్ ఫ్లాగ్, నేషనల్ ఫ్లాగ్, అసెంబ్లీ ఫ్లాగ్ ల ఆవిష్కరణలతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఈ వేదిక కేవలం క్రీడాకారుల కోసం ఏర్పాటు చేయబడిందని, ఇందులో ఎటువంటి రాజకీయాలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలు, పనులు, అసెంబ్లీ సమావేశాలతో ఒత్తిడి (టెన్షన్) ఉంటుందని, అటువంటి వారికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. 1983లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రజాప్రతినిధులు కోసం క్రీడా పోటీలను ప్రారంభించారని, ఆ సంప్రదాయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని మళ్ళీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత అసెంబ్లీలో దాదాపు 78% మంది యువ ఎమ్మెల్యేలు ఉన్నారని, వారి ఉత్సాహం ఈ పోటీలకు మరింత బలాన్ని ఇస్తుందని ఆయన అన్నారు. ఈ పోటీలు కేవలం ప్రజాప్రతినిధులకే పరిమితం కాదని, ప్రజలు కూడా వచ్చి వీక్షించి తమ ప్రతినిధులను ప్రోత్సహించాలని కోరారు. తన చిన్నతనంలో వాలీబాల్ ఆడేవాడినని, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తన ఆటను చూసి రాజకీయాల్లోకి ఆహ్వానించిన.. తన పాత జ్ఞాపకాలను స్పీకర్ గుర్తు చేసుకున్నారు. క్రీడల ముగింపు రోజున (అసెంబ్లీ చివరి రోజు) ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులతో కలిసి రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారని, ఆ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు.

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ గతంలో దివంగత ఎన్.టి.రామారావు హయాంలో ప్రారంభమై, మధ్యలో నిలిచిపోయిన ఈ క్రీడా సంప్రదాయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తిరిగి ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. రాజకీయ కార్యకలాపాలు, సభల వల్ల కలిగే పని ఒత్తిడి నుండి ప్రజా ప్రతినిధులకు ఈ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, వికాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. పార్టీలు, వ్యక్తుల మధ్య ఉండే చిన్న చిన్న విభేదాలను మర్చిపోయి, అందరూ కలిసి మెలిసి ఉండటానికి ఇటువంటి కార్యక్రమాలు ఒక వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మరుగున పడుతున్న గ్రామీణ క్రీడలను, పాఠశాలల్లో క్రీడల ప్రాధాన్యతను మళ్ళీ ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా రాష్ట్ర యువత, విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి, అవగాహన పెరుగుతుందని, ఇది జిల్లా స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తయారు చేయడానికి నాంది కావాలని కోరారు.

శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు శాసనసభ, శాసనమండలి సభ్యులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది కంటే ఈసారి పోటీలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన కమిటీ ఈ పోటీల ఏర్పాట్లను పర్యవేక్షిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలనే ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా శాప్ (క్రీడా) మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముందుగా స్పీకర్ అయ్యన్న పాత్రుడుతో కలిసి ప్రజాప్రతినిధులు అందరూ అధికారికంగా క్రీడా జ్యోతి ని వెలిగించి క్రీడలను ప్రారంభించారు.

కార్యక్రమంలో శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, డిప్యూటీ స్పీకర్ కే. రఘురామ కృష్ణం రాజు, ప్రభుత్వ విప్ లు జీవీ ఆంజనేయులు, పి. అనురాధ, శాప్ వీసీ మరియు ఎండీ ఎస్. భరణి ఇతర అధికారులు తెలియజేశారు.

# రక్తదానంతో దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు

- రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** స్వచ్ఛందంగా రక్తదానం చేయడం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని

అంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్ ) చైర్మెన్ రవి నాయుడు అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని బాధ్యతగా తీసుకుని కీలక పరిస్థితుల్లో ఆవసరమైన వారికి ప్రాణధానం చేసేందుకు ముందుకు దావాలని కోరారు. మంగళవారం ఉదయం విజయవాడ ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో ఎస్ఆర్ ఎం విశ్వవిద్యాలయంలో ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శాప్ చైర్మన్ రవి కుమార్ ముఖ్య అతిధిగా హాజరై శిబిర నిర్వహణను పర్యవేక్షించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు, ఎన్ సీ సీ వాలెంటీర్ల ను పేరు పేరునా పలకరించి వారిని అభినందించారు. ఎక్కువ ముంది విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినంద నీయమని ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పర్యవేక్షణలో కొనసాగుతున్న ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని శిబిర నిర్వహణ ఇన్ఛార్జ్ రవి కుమార్ పేర్కొన్నారు. డాక్టర్ జ్యోత్స్నదేవి డాక్టర్ పవన్ దగ్గరుండి రక్తదాన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఒక్కొక్క దాత నుంచి 350 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరించి భవిష్యత్తులో బాధితుల అవసరార్థం వినియోగిస్తామని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ముత్తం 410 మంది విద్యార్థులు, ఉద్యోగులు రక్త దానం చేశారని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా హెచ్ డీఎఫ్‌సీ బ్యా బ్యాంకు సహకారంతో సమకూర్చిన కప్, ప్రశంసా పత్రాలను రక్త దాతలకు అందజేశారు. డాక్టర్ జ్యోత్స, డాక్టర్ పవన్, ఎసీఆర్ ఎం వర్సెటీ అసోసియేట్ డైరెక్టర్ రేవతి, కార్యక్రమ ఇన్ చార్జి రవి శాప్ ఛైర్మన్ రవి నాయుడును శాలువాతో సత్కరించి జ్ఞాపికను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, ఎన్సీసీ, ఎన్.ఎస్ఎస్. వాలెంటీర్లు పాల్గొన్నారు.

# మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళన విరమణ

- ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కీలక నిర్ణయాలు
- తక్షణమే విధులకు హాజరవుతామని ఉద్యోగుల హామీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ఉద్యోగుల ఆందోళనకు ముగింపు పలికింది. మంగళవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ (ఎక్స్‌అఫీషియో), ఆర్ సీ ఎస్ ఆహ్మద్ బాబు, ఆప్కాబ్ ఎండీ రామకృష్ణలతో కలిసి నిర్వహించిన ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో విస్తృత చర్చలు జరిపి, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశాల ఫలితంగా 6 డిసెంబర్ 2025 నుంచి కొనసాగుతున్న పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళనకు తెరపడింది. ప్రభుత్వం ఉద్యోగుల జీతాలకు మొత్తం 20 శాతం పెంపును ఆమోదించగా, గ్రాట్యుటీని రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచింది. అలాగే ప్రతి ఉద్యోగికి రూ.5 లక్షల కవరేజీతో సమగ్ర గ్రూప్ మెడికల్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని నిర్ణయించింది. పీఏసీఎస్ ఉద్యోగులకు సంబంధించిన పై ప్రయోజనాల అమలు విధానాలను ఉన్నత స్థాయి కమిటీ అతి త్వరలో ప్రకటిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అదేవిధంగా పీఏసీఎస్ యూనియన్లకు సంబంధించిన ఇతర డిమాండ్లను కూడా కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసులు చేయనుందన్నారు. సహకార బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయడంలో, రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధికి మద్దతు ఇవ్వడంలో పీఏసీఎస్ ఉద్యోగుల పాత్ర కీలకమని ప్రభుత్వం స్పష్టంగా గుర్తించిందన్నారు. పీఏసీఎస్ కంప్యూటరైజేషన్, ఈఆర్పి లో రియల్‌టైమ్ లావాదేవీలు, డైనమిక్ ఈఓడీ ప్రక్రియలు, హెచ్ఆర్ఎంఎస్ ద్వారా జీతాల చెల్లింపు వంటి కీలక బాధ్యతలను ఉద్యోగులు నిబద్ధతతో నిర్వహిస్తున్నారని మంత్రి అచ్చెన్న ప్రశంశించారు.

**మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు:** ఈ సందర్భంగా విజయవాడలోని క్యాంప్ ర్యాలీలో పీఏసీఎస్ ఉద్యోగులు మంత్రి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ ఈ సానుకూల నిర్ణయాల వలన సహకార బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ఉద్యోగులు మరింత ఉత్సాహంతో రైతులకు సేవలు అందిస్తారని సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ నిర్ణయాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మిక హిత దృక్పథానికి, మంత్రి అచ్చెన్నాయుడు దూరదృష్టి నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు హెచ్ ఆర్ పాలసీని ఆచరణలోకి తీసుకురావడం, నేడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జీతాలు పెంపు జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు.

తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, తక్షణమే ఆందోళన విరమించి సాధారణ విధులకు హాజరవుతామని ఉద్యోగులు స్పష్టం చేశారు.

# ఆనవాయితీగా మార్చి 29 నుండి తెనాలిలో జాతీయ స్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** అనాదిగా వ్యవసాయంలొ రైతుకు చేదోడుగా ఉండే బసవన్నల బలప్రదర్శనలు, గోమాతల పాల ప్రదర్శన పోటీలు ఆనవాయితీగా వ్యవసాయ మార్కెట్ యాడ్డు ప్రాంగణం వేదికగా మార్చి 29 నుండి ప్రారంభం కానున్నాయి.

తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయ కర్త, డెల్టా టైగర్ గా జిల్లా రాజకీయాలలో సుపరిచితులైన, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ జన్మదినోత్సవమైన ఏప్రిల్ 4, వ, తేదీన జాతీయ యడ్లబల ప్రదర్శన పోటీలు ముగించడం,తెనాలి ప్రాంతానికి ఓ ఆనవాయితీ 2026 సంవత్సరానికి జాతీయ ఎడ్ల బల ప్రదర్శన, గోవుల పాల ప్రదర్శన పోటీల నిర్వాహణపై, మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పార్టీ నాయకులతొ, మార్కెట్ యార్డు ప్రాంగణంలొ సమావేశమయ్యారు.

సమావేశ సారాంశాన్ని, రైతు నాయకులు, వీరమాచినేని వెంకటేశ్వరరావు మీడియాకు వివరించారు.

ఆలపాటి శివరామకృష్ణయ్య స్మారక జాతీయ స్థాయి ఎడ్లబల ప్రదర్శన, ఒంగోలు జాతి ఆవుల పాల ప్రదర్శన పోటీలు మార్చి 29నుండి ఏప్రియల్ 4వ, తేదీవరకు 5రోజులు నిర్వహించ నున్న క్రమంలో, ఈనెల 27న, మార్కెట్ యార్డ్ ప్రాంగణంలొ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొబ్బరి కాయ కొట్టి, ఎడ్లబల ప్రదర్శన ఏర్పాట్ల, పనులను లాంచనంగా ప్రారంభిస్తారని చెప్పారు.

ఆరోజున పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్న వలసిందిగా కోరారు. ఈ సమావేశంలొ నియోజక తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# గుడికట్ల పూజారులకు అండగా నిలవండి

## మంత్రి ఆనంతో మంత్రి సవిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఎస్.సవిత కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాయలంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆమె మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుడికట్ల పూజారులకు సంబంధించిన సమస్యలపై దేవాదాయ శాఖ మంత్రి ఆనంతో మంత్రి సవిత చర్చించారు. రాష్ట్రంలో వ్యాప్తంగా 700ల వరకూ గుడికట్ల దేవాలయాలు ఉన్నాయన్నారు. వాటిలో ఉండే పూజారులు కురబ సామాజిక వర్గానికి చెందిన వారన్నారు. వారిని ఆదుకోవాల్సిన ఆశ్యకత ఉందన్నారు. దీనిలో భాగంగా వారికి గౌరవ వేతనం అందించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో చిన్న దేవాలయాలకు గౌరవం వేతనంతో పాటు ధూప, దీప, నైవేద్యాల కింద రూ.10 వేలు అందిస్తున్నారన్నారు. వారికి మాదిరే గుడికట్ల దేవాలయాల నిర్వహణకూ రూ.10 వేలు చొప్పున అందించాలని మంత్రి సవిత కోరారు. గుడికట్ల పూజార్ల సమస్యలపై మంత్రి ఆనంకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించారు. గుడికట్ల పూజార్ల సమస్యల పరిష్కారానికి అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట రాష్ట్ర కురుబల సంక్షేమ సంఘం, గుడికట్ల దేవాలయ పూజారుల ప్రతినిధులు ఉన్నారు.

# మార్చి 9 నుండి ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మహిళ, పురుష అభ్యర్థులకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ మార్చి 9వ తేదీ నుండి ప్రారంభం అవుతుందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అభ్యర్థులకు మంచి అవకాశం అన్నారు. ఎంతో మంది ఉద్యోగాలకు వస్తున్నారని అటువంటి యువత ఉద్యోగం పొందుటకు అవకాశం లభించిందన్నారు.

హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ డైరెక్టర్ వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహిస్తుందన్నారు. మార్చి 9, 10 తేదీలలో బాలికలకు., మార్చి 12,13 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ పురుష అభ్యర్థులకు, మార్చి 15,16 తేదీలలో తెలంగాణ పురుష అభ్యర్థులకు ఓపెన్ ర్యాలీ జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంపిక కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 2005 జూలై 2 నుండి 2009 జనవరి 2వ తేదీ మధ్య జన్మించిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు.

కనీస ఎత్తు 152 సెం.మీ. (స్త్రీ మరియు పురుషులు), ఇంటర్మీడియట్ (10ం2)లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత లేదా 3 సంవత్సరాల డిప్లొమా ఇంజనీరింగ్ లేదా 2 సంవత్సరాల ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణత కలిగిన విద్యార్హత ఉండాలన్నారు. మొత్తం మార్కుల్లో 50 శాతం మరియు ఇంగ్లీషులో 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

అభ్యర్థులు ఎలాంటి ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, నేరుగా ర్యాలీ కీ హాజరు కావచ్చని తెలిపారు. ఒరిజినల్ లేదా డిజీలాకర్ ద్వారా ధృవపరిచిన విద్యార్హత సర్టిఫికేట్లు టెన్త్, ఇంటర్ పాసైన సర్టిఫికేట్లు లేదా తత్సమాన విద్యార్హత సర్టిఫికేట్లు), నివాస ధృవీకరణ (డొమిసైల్ సర్టిఫికేట్), ఎన్.సి.సి సర్టిఫికెట్ (ఒక వేళ ఉంటే), ఆధార్ కార్డ్, ఈ–మెయిల్ ఐడి, మొబైల్ నంబర్, ఇటీవలి తీసుకున్న 10 కాపీలు పాస్ పోర్ట్ సైజు కలర్ ఫోటోలు, ప్రతి సర్టిఫికెట్ కు సంబంధించిన 6 జిరాక్స్ కాపీలు తీసుకురావాలని వివరించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మహిళ అభ్యర్థులు మార్చి 9వ తేదీన, ఆంధ్రప్రదేశ్ పురుష అభ్యర్థులు మార్చి 12వ తేదీన, తెలంగాణ పురుష అభ్యర్థులు మార్చి 15వ తేదీ ఉదయం 6 గంటల నుండి10 గంటలు వరకు నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో హాజరు కావాలని కోరారు. 1.6 కిలో మీటర్ల పరుగు పోటీ, భౌతిక, శారీరక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుందని చెప్పారు. రాత పరీక్షకు ప్రశ్నపత్రం ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉంటుందని, ఒక తప్పు జవాబుకు పావు మార్కు తీసివేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, రవాణా శాఖ ఉప కమిషనర్ కె. సీతారామి రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల, ఎం.టి.ఎం.సి డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, డి.ఎస్పీ బి.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467